# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **జాతీయ సహకార అభివృద్ధి సంస్థకు 2 వేల కోట్ల రూపాయల కేటాయింపుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**2.** **ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు వైయస్సార్ కడప జిల్లాలో నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.**

**3.** **తెలంగాణలో ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తున్నామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.**

**4.** **రానున్న ఐదేళ్లలో 45వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు రానున్నాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**

**5.** **తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు తల్లి పాల వారోత్సవాలు ఈ రోజు నుండి ప్రారంభమవుతున్నాయి.**

==========================

జాతీయ సహకార అభివృద్ధి సంస్థ –ఎన్‌సిడిసికు 2 వేల కోట్ల రూపాయల కేటాయింపుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో సమావేశమైన కేంద్రమంత్రి వర్గం నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వెల్లడించారు. ప్రధానమంత్రి కిసాన్ సంపద యోజన కోసం 1,920 కోట్ల రూపాయల అదనపు వ్యయంతో సహా మొత్తం 6 వేల 520 కోట్ల రూపాయల వ్యయాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరం నుండి 2028–29 వరకు 4 సంవత్సరాల కాలానికి 2 వేల కోట్ల రూపాయలను జాతీయ సహకార అభివృద్ధిసంస్థకి మంజూరు చేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని తెలుపుతూ,

వాయిస్ 30 సెకన్లు

అదే విధంగా మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలలోని 13 జిల్లాల పరిధిలో నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులను ఆమోదించిందని అశ్విని వైష్ణవ్ తెలిపారు.

------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు వైయస్సార్ కడప జిల్లాలో పర్యటిస్తారు.

ఇందులో భాగంగా జమ్మలమడుగులో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేస్తారు. చేనేత కార్మికులతో సమావేశమవుతారు. ప్రజా వేదికలో పి4 బంగారు కుటుంబాలతో ముఖాముఖిలో పాల్గొంటారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 77.91 కోట్ల రూపాయలతో చేపడుతోన్న గండికోట పర్యాటక ప్రాజెక్టుకు ఈ రోజు శంకుస్థాపన చేస్తారని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లా గండికోటలోని జుమ్మా మసీదు, ఎర్రకోనేరు, మాధవరాయస్వామి, రంగనాథ ఆలయాలను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, గండికోటతో పాటు 165 కోట్ల రూపాయలతో చేపడుతోన్న 5 పర్యాటక ప్రాజెక్టులకు దృశ్య మాధ్యమం ద్వారా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. అహోబిలం, గండికోట ప్రాంతాలకు యునెస్కో గుర్తింపు వచ్చేలా ఇక్కడి శిల్ప కళా నైపుణ్యాలు, చారిత్రక కట్టడాల సుందరీకరణ పనులు చేపట్టనున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

సముద్రంలోకి వృధాగా వెళ్లే వరద జలాలతో జలాశయాలు నింపాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు, సమర్ధ నీటి నిర్వహణపై జల వనరుల శాఖ అధికారులతో గత సాయంత్రం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతీ నీటి చుక్కను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 43 వేల చెరువులను నింపటం ద్వారా భూగర్భజలాల స్థాయిని పెంచవచ్చని తెలిపారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహాలు కొనసాగుతున్నందున రాయలసీమలోని ప్రాజెక్టులకు నీటిని తరలించే అంశంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---------------------------

తెలంగాణలో ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చేస్తున్నామని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనానికి శంకుస్థాపన, అదనపు తరగతి గదులకు మంత్రి నిన్న ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్ ఛార్జీలను, కాస్మెటిక్ ఛార్జీలను పెంచామన్నారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలతో యంగ్ ఇండియా సమీకృత పాఠశాలలను నిర్మిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 30 సెకన్లు

---------------------------

హజ్ యాత్ర-2026కు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు గడువును ఈనెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఒక ప్రకటనలో వెల్లడించారు. హజ్ యాత్ర కోసం దరఖాస్తులు అన్నీ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారని తెలిపారు. హజ్ కు వెళ్లాలనుకొనే ఆంధ్రప్రదేశ్ యాత్రికులు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎంచుకొని దరఖాస్తు చేసుకోవాలని మంత్రి కోరారు. ఇప్పటికే హజ్‌కు దరఖాస్తు చేసుకున్న యాత్రికులందరూ కూడా ప్రయాణ కేంద్రాల ప్రాధాన్యతలో మార్పు చేసుకుని విజయవాడ కేంద్రాన్ని ఎంచుకోవాలని సూచించారు.

---------------------------

రానున్న ఐదేళ్లలో 45వేల కోట్ల రూపాయల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు రానున్నాయని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో సింగపూర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పంద వివరాలను ఆయన నిన్న పాత్రికేయులకు వివరించారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు రానున్నాయని పెట్టుబడులను ఆకర్షించేందుకు సింగపూర్‌లో నిర్వహించిన పర్యటన విజయవంతం అయిందని మంత్రి నారా లోకేష్ తెలియజేస్తూ...

వాయిస్ 25 సెకన్లు

---------------------------

తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు తల్లి పాల వారోత్సవాలు ఈరోజు నుండి ప్రారంభమవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించిన ఒక తీర్మానం మేరకు ప్రతి ఏటా ఆగస్టు 1వ తేదీ నుండి వారంరోజులపాటు ప్రపంచ దేశాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. శిశువుకు తల్లిపాలు మంచి పౌష్టికాహారమని... ఎంతో సురక్షితమైనవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో రోగ నిరోధక శక్తి పొందాలంటే తల్లి పాలకు మించిన దివ్య ఔషధం మరొకటి లేదని... బిడ్డ పుట్టిన మొదటి అరగంట లోపు తల్లి నుండి వచ్చే ముర్రుపాలు బిడ్డకు సమతుల పోషకాహారాన్ని అందజేస్తాయని కూడా వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తల్లి పాల విశిష్టతను తెలియజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వారం రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

---------------------------

విద్య, నైపుణ్యాలకు ప్రాధాన్యమిస్తూ తెలంగాణ ప్రభుత్వం నైపుణ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో 40కోట్ల రూపాయలతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి మంత్రి నిన్న భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం అభివృద్ధికి 100 కోట్ల రూపాయలతో భవనాలు నిర్మించామని, ఎల్ఎల్ఎం, ఎం ఫార్మసీ కోర్సులు మంజూరు చేశామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాం దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మి తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================